బలగం
BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 07 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోడీ భేటీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రధాని నరేంద్రమోడీ శనివారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు. జపాన్, చైనా దేశాల పర్యటన ముగించుకుని విచ్చేసిన ప్రధాని మోడీ తన పర్యటన విశేషాలను రాష్ట్రపతితో ప్రస్తావించారు. చైనా తియాన్‌జిన్‌లో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1వరకు జరిగిన షాంఘై సహకార సంస్థ 25 వ వార్షిక సమావేశాలకు ప్రధాని మోడీ హాజరయ్యారు. ఈ శిఖరాగ్ర సమావేశంలో షాంఘై సహకార సంస్థ అభివృద్ధి వ్యూహం, గ్లోబల్ గవర్నెన్స్‌లో సంస్కరణలు, ఉగ్రవాద నిరోధక చర్యలు, శాంతి, భద్రత , ఆర్థిక రంగాల్లో సహకారం, సుస్థిర అభివృద్ధిపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి.

# నిమజ్జనోత్సవ వైభవం

- జనసంద్రంగా మారిన ట్యాంక్ బండ్
- ఆకస్మికంగా ట్యాంక్‌బండ్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రశాంతంగా ఖైరతాబాద్ మహాగణపతి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నగరవ్యాప్తంగా వినాయక నిమజ్జనాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. హుస్సేన్ సాగర్‌తో పాటు పలు చెరువుల వద్ద గణనాథుల నిమజ్జన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. డప్పు చప్పుళ్ల, భక్తి గీతాల నడుమ ఊరేగింపుగా వచ్చే వివిధ రూపాల గణనాథులను చూడటానికి భక్తుల రద్దీగా ఉంది. జంటనగరాల తోపాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి వస్తున్న లక్షలాది మంది భక్తులు, వేలాది సంఖ్యలో గణనాథులు నగరవ్యా ప్తంగా కొలువుదీరాయి. శనివారం వేల సంఖ్యలో విగ్రహాలు హుస్సేన్ సాగర్‌తో సహా పలు ప్రాంతాల్లో గణనాథులు గంగమ్మ ఒడికి చేరాయి. కోలాహలంగా కొనసాగిన గణేష్ శోభయాత్రలో భక్తులు నినాదాలతో హోరెత్తించారు. పలు రూపాల్లో కొలువైన గణనాథుని విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఖైరతాబాద్ గణపతి శోభాయాత్రను చూడటానికి భక్తులు భారీగా తరలిరావడంతో ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. జనసంద్రంగా మారిన ట్యాంక్ బండ్‌పై సీఎం రేవంత్ రెడ్డి, విపక్ష నేత కేసీఆర్ పేరుతో ఆలపించిన పాటలు హోరెత్తించాయి. గీతాలను ఆలపించారు. మార్మోగిన సౌండ్ సిస్టంతో ఆలపించిన గీతాలకు భక్తులు, రాజకీయ నాయకులు సైతం నృత్యాలు చేశారు. ఇక శనివారం అర్ధరాత్రి కూడా నిమజ్జ నాలు కొనసాగాయి. ఆదివారం ఉదయం వరకూ ఈ నిమజ్జన ప్రక్రియ కొనసాగనుంది.

## సాదాసీదాగా ట్యాంక్‌బండ్‌కు సీఎం రేవంత్ రెడ్డి



ట్యాంక్‌బండ్ వద్ద గణేష్ నిమజ్జనాల వేడుకను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్వయంగా సీఎం ట్యాంక్‌బండ్‌కు చేరుకుని భద్రతా ఏర్పాటను పరిశీలించారు. ఎలాంటి హంగూ ఆర్భాటం లేదు. ఎప్పుడూ ఉండే భద్రతా సిబ్బంది కూడా లేదు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు ఒక సామాన్యుడిలా వచ్చి భక్తుల మధ్య చేరిపోయి గణనాథుల నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపులు, క్లియరెన్స్ లేకుండా పరిమిత సంఖ్యలో వాహనాలతో సాదాసీదాగా నలుగురైదుగురు వ్యక్తిగత సిబ్బందితో ట్యాంక్ బండ్ వద్దకు వచ్చిన ముఖ్యమంత్రి గారు అక్కడ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల మధ్య చేరిపోయి ఏర్పాట్లు ఎలా ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు.గణపతి బొప్పా... మోరియా.. అంటూ పెద్ద ఎత్తున భక్తుల నినాదాలు మారుమోగుతున్న వేళ.. ముందస్తు సమాచారం లేకుండా సాదాసీదాగా అక్కడికి చేరుకున్న ముఖ్యమంత్రి భాగ్యనగర్ ఉత్సవ సమితి వేదిక పైకి ఎక్కి అశేషంగా తరలివచ్చిన భక్తులకు అభివాదం చేశారు. అదే క్రమంలో క్రేన్ నంబర్ 4 వద్దకు వెళ్లి నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఉదయం నుంచే శోభాయాత్ర ప్రారంభమై ఒక్కొక్కటిగా గణపతులు ట్యాంక్‌బండ్ తరులుతుండగా, సాయంత్రానికి మహా గణపతి శోభాయాత్ర ఊపందుకుంది. ఆ సమయంలో ఒక సాధారణ వ్యక్తిలా ముఖ్యమంత్రి ఆ మహా జనంలో కలిసిపోయి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులతో కరచాలనం చేస్తూ ముందుకు నడిచారు. హుస్సేన్‌సాగర్‌లో ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్ (పీవీ మార్గ్) లో నిరాటంకంగా సాగుతున్న నిమజ్జన కార్యక్రమం ఏర్పాట్లలో పాల్గొన్న సిబ్బందిని అభినందించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు అదే స్ఫూర్తితో పని చేయాలని చెప్పారు

## మహా గణపత్తి నిమజ్జనం



69 అడుగుల ఖైరతాబాద్ బడా గణేశ్ శోభయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. వేలాది మంది భక్తుల మధ్య కొనసాగిన ఖైరతాబాద్ బడా గణేశ్ శోభయాత్ర నిమజ్జన ప్రక్రియతో ప్రశాంతంగా ముగిసింది. దయం 7.30 గంటలకు ప్రారంభమైన బడా గణేశ్ శోభాయాత్ర మధ్యాహ్నం 12 గంటలకు ట్యాంక్‌బండ్‌కు చేరుకుంది. దారిపొడవున ఎక్కడ చూసినా గణపతి బప్ప మోరియా అంటూ చిన్నాపెద్దా అంతా వారి భక్తిని చాటుకున్నారు. అడుగడుగున మహాగణపతికి నీరాజనం పలికారు.

మహాగణపతిని చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. విజయవాడ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన వాహనంలో 70 టన్నుల భారీ గణనాథుడి శోభాయాత్ర నిర్వహించారు. భక్తుల కోలాహలం నడుమ ఎన్టీఆర్ మార్గ్‌లోని నాలుగో క్రేన్ వద్దకు చేరిన లంబోధరుడికి.. ఖైరతాబాద్ ఉత్సవసమితి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ క్రేన్ సహాయంతో హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేశారు.

## చర్లపల్లిలో డ్రగ్స్ తయారీ యూనిట్ దాడి



- రూ.11.58 కోట్ల ముడిసరకులు స్వాధీనం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన డ్రగ్స్ కేసుకు సంబంధించి కీలక మూలాలు నగరంలో వెలుగులోకి వచ్చాయి. మహారాష్ట్ర క్రైం బ్రాంచ్ పోలీసులు శనివారం చర్లపల్లిలోని డ్రగ్స్ తయారీ యూనిట్‌పై దాడి చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ. 11.58 కోట్ల విలువైన డ్రగ్స్ ముడిసరకులు స్వాధీనం కావడంతో కలకలం రేగింది.

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం ఫ్యాక్టరీల్లో 5.790 కిలోల ఎమ్‌డీ మందులు, 35,500 లీటర్ల రసాయనాలు, 950 కిలోల పౌడర్, ఔషధాల తయారీకి ఉపయోగించే పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు ఈ కేసులో 13 మందిని అరెస్టు చేశారు. నగరంలోని రాంనగర్ గుండుకు చెందిన ఒలేటి శ్రీనివాస్ విజయ్, తనాజీరావు గతంలో జివికె ల్యాబ్‌లో పనిచేశారు. ఉద్యోగం మానేసిన తర్వాత చర్లపల్లి పారిశ్రామికవాడ, నవోదయనగర్, నాచారం పారిశ్రామికవాడల్లో షెడ్డులు అద్దెకు తీసుకుని "వాక్‌దేవి ల్యాబరేటరీ" పేరుతో పరిశ్రమలను నడిపారు. ఇందులో డ్రగ్స్ తయారీకి అవసరమైన రామెటీరియల్ సిద్ధం చేసి, నాచారంలోని ల్యాబ్‌లో మెఫెడ్రోన్ తయారు చేసి ముంబయి, దేశంలోని ఇతర ప్రాంతాలకు స్మగ్లర్లకు విక్రయించేవారని పోలీసులు గుర్తించారు.గత నెల 8వ తేదీన క్రైం బ్రాంచ్ పోలీసులు బంగ్లాదేశ్‌కు చెందిన ఫాతిమా మురాద్ షేక్ అలియాస్ మొల్లా (23) వద్ద నుంచి 105 గ్రాముల ఎమ్‌డీ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఆమె విచారణలో పదిమంది పేర్లు బయటపడ్డాయి. వారిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 178 గ్రాముల డ్రగ్స్, రూ.2.97 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

విచారణలో డ్రగ్స్ తెలంగాణ నుంచే సరఫరా అవుతున్నట్లు తేలడంతో ముంబయి క్రైం బ్రాంచ్ పోలీసులు ఇన్స్‌పెక్టర్ ప్రమోద్ బదఖ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ చేరుకుని చర్లపల్లి, నాచారంలో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో విజయ్ శ్రీనివాస్, తనాజీ రావును అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరుపరిచి ముంబ యికి తరలించారు. వారిని కోర్టులో ప్రవేశపెట్టి రిమాం డ్‌కు పంపనున్నట్లు మహారాష్ట్ర పోలీసులు తెలిపారు.

### దక్షిణాదికి గేమ్ చేంజర్‌గా

## ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి



- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు, మున్నేరు బ్రిడ్జి పనుల తనిఖీ


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి భవిష్యత్తులో దక్షిణ భారతదేశానికి గేమ్ చేంజర్‌గా మారి ఖమ్మం జిల్లా కు వరంగా మారబోతున్నదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. శనివారం ఖమ్మం నగర శివారులో ధంసలాపురం వద్ద ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు, మున్నేరు బ్రిడ్జి పనులను ఆయన తనిఖీ చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే ఆర్ఓబి, ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులు, ఏజెన్సీలకు పలు సూచనలు చేశారు. ఖమ్మంక్ష్మదేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి, కొత్త ఏడాదిలో ప్రజలకు అందుబాటులో తేవాలని ఆదేశించారు. ఉత్తర, దక్షిణ భారతాన్ని కలుపుతూ కనెక్టింగ్ హైవేగా ఖమ్మానికే కాదు.. తెలంగాణకు గేమ్ చేంజర్‌గా మారుతుందని అన్నారు.

160 కిలోమీటర్ల జాతీయ రహదారి పూర్తికావడం వల్ల గంటన్నర సమయంలో ఖమ్మం నుంచి రాజమండ్రి వెళ్ళవచ్చుని అన్నారు. సూర్యాపేట నుంచి విజయవాడ వెళ్లకుండా ఖమ్మం మీదుగా వైజాగ్, గోదావరి జిల్లాలవారు, ఒడిశా వెళ్ళేవారికి ప్రయాణం 150 కిలోమీటర్లు తగ్గుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, ఇక్కడి వారికి ఈ రోడ్డు ఉపయోగపడుతుందని తెలిపారు. ఉత్తర దక్షిణ భారతదేశాన్ని కలిపే రహదారిగా తయారవుతుందని, రూ.3,500 కోట్లతో ఈ రహదారి నిర్మిస్తున్నామని అన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి డిజైన్స్ రూపకల్పనలో జాప్యం కావడం వల్ల ఆలస్యం జరిగిందని అన్నారు. దంసలాపురం ఎగ్జిట్ ప్లాన్‌లో ముందు లేకపోవడం వల్లనే పనుల్లో జాప్యం జరిగిందన్నారు. ధంసలాపురం ఆరోఓబి నవంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఎగ్జిట్ పనులు తో పాటు మున్నేరు బ్రిడ్జి రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా నవంబర్ నాటికి కావాలన్నారు.

ఆర్.ఓ.బి. నిర్మాణానికి సంబంధించి హైటెన్షన్ విద్యుత్ లైన్స్ తరలింపు, భూసేకరణ వంటి అన్నిపనులు పూర్తి చేశామని, నవంబర్ నాటికి ఒకవైపు రైల్వే బ్రిడ్జి పూర్తి చేసుకుంటే సత్తుపల్లి -జంగారెడ్డిగూడెం వరకు ఉపయోగపడుతుందని అన్నారు. కొత్త సంవత్సరంలో ఖమ్మంక్ష్మదేవరపల్లి జాతీయ రహదారి పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి రావాలని అన్నారు. రైల్వే శాఖను సమన్వయం చేసుకుంటూ ఆర్ఒబి మిగితా 2వ పేజీలో

## ట్రంప్ స్నేహపూర్వక భావనలను గౌరవిస్తా



- ప్రధాని నరేంద్ర మోదీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం స్పందించారు. ట్రంప్ స్నేహపూర్వక భావనలను తాను పూర్తిగా గౌరవిస్తానని, వాటికి కట్టుబడి ఉంటానని మోదీ స్పష్టం చేశారు. ఇటీవల భారత్-అమెరికా మధ్య వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో ఇరు దేశాల నేతల మధ్య ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది. "అధ్యక్షుడు ట్రంప్ మా సంబంధాలపై చేసిన సానుకూల వ్యాఖ్యలను, ఆయన స్నేహభావనను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. వాటికి మేం పూర్తిగా కట్టుబడి ఉన్నాం. భారత్-అమెరికా మధ్య ఎంతో సానుకూలమైన, భవిష్యత్ ప్రణాళికలతో కూడిన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది" అని మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

అంతకుముందు ట్రంప్ మాట్లాడుతూ ప్రధాని మోదీ తనకు ఎప్పటికీ స్నేహితుడేనని, ఇరు దేశాల మధ్య ప్రత్యేకమైన బంధం ఉందని గుర్తుచేశారు. అయితే భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అసంతృప్తి వ్యక్తం చేశారు. "మోదీ గొప్ప నాయకుడు. మేము ఎప్పుడూ స్నేహితులమే. కానీ ప్రస్తుత తరుణంలో ఆయన చేస్తున్న పని నాకు నచ్చడం లేదు. అయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మా మధ్య అప్పుడప్పుడు కొన్ని సమస్యలు వస్తుంటాయి" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు నేపథ్యంలో అమెరికా భారత్‌పై ద్వితీయ శ్రేణి భారీ సుంకాలు విధించింది. కొత్త జాబితా ప్రకారం బ్రెజిల్ తర్వాత భారత ఎగుమతులపైనే అత్యధికంగా 50 శాతం పైగా టారిఫ్‌లు విధించబడ్డాయి. ఈ చర్యను భారత్ తీవ్రంగా ఖండిస్తూ "అన్యాయమైన, అహేతుకమైన నిర్ణయం"గా పేర్కొంది.



## భారత్-అమెరికా సంబంధాలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు

**బలగం టీవీ, వాషింగ్టన్**

భారత్‌తో ఉన్న స్నేహ సంబంధాలపై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారీ పన్నుల నేపథ్యంలో భారత్%–%అమెరికా సంబంధాలు దెబ్బతిన్నాయని, భారత్‌ను చైనాకు కోల్పోయామని ఇటీవలే తన సోషల్ మీడియా ఖాతా ట్రూత్లో పేర్కొన్న విషయం తెలిసిందే. తాజా విలేకరుల సమావేశంలో దీనిపై ఆయనను మీడియా ప్రశ్నించగా స్పందించారు. 'భారత్ ప్రస్తుతం వ్యవహరిస్తున్న తీరు నన్ను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. రష్యా నుంచి వారు విస్తృతంగా చమురు దిగుమతి చేసుకుంటున్నారు. వెనక్కి తగ్గకపోవడంతోనే భారత దిగుమతులపై భారీ పన్నులు విధించాల్సి వచ్చింది. భారత్‌పై విధించిన 50 శాతం పన్నులు నిజంగా ఎక్కువే' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

అయితే ప్రధాని నరేంద్ర మోదీతో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని ఆయన మరోసారి గుర్తుచేశారు. 'మోదీ గొప్ప నాయకుడు. ఆయనతో నాకు వ్యక్తిగత సంబంధం ఉంది. అయితే ప్రస్తుతం ఆయన చేస్తున్న కొన్ని చర్యలు నాకు నచ్చడం లేదు. ఎన్నో దశాబ్దాలుగా భారత్-అమెరికా ప్రత్యేక అనుబంధం కొనసాగుతోంది. దీనిపై అతిగా ఆందోళన అవసరం లేదు. కొద్ది నెలల క్రితమే మోదీ అమెరికా పర్యటనలో భాగంగా మేమిద్దరం రోజ్ గార్డెన్‌లో కలసి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించాం' అని ట్రంప్ పేర్కొన్నారు.

## హైదరాబాద్ సున్నితమైన నగరం

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశంలోనే హైదరాబాద్ నగరం అత్యంత సున్నితమైన నగరమని పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 170మంది ట్రైనీ ఐపీఎస్‌లు శనివారం టీజీఐసీసీ లో సీపీ సీవీ ఆనంద్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో 10 ఏళ్లుగా విధులు నిర్వహిస్తు న్నానని, గణేష్ ఉత్సవాల బందోబస్తు నిర్వహించడం ఇది 13వ సారి కాగా, పోలీస్ కమిషనర్‌గా నాలుగోసారి నిర్వహిస్తున్నానని తెలిపారు.

హైదరాబాద్ దేశంలోనే అత్యంత సున్నితమైన, విస్తారమైన నగరాల్లో ఒకటని, అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నందున పండుగల సమయంలో భద్రత అత్యంత కీలకమని అన్నారు. ఈ ఏడాది నిమజ్జన చివరి రోజున సుమారు 25,000 విగ్రహాలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇంత భారీ స్థాయిలో జరిగే ఉత్సవాల్లో తొక్కిసలాటలు జరగకుండా పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ, బోనాలు, దసరా నవరాత్రులు, హనుమాన్ ర్యాలీ, శ్రీరామనవమి ర్యాలీ వంటి పండుగల నిర్వహణలో పోలీసుల పాత్ర కీలకమని అన్నారు.

హైదరాబాద్ పోలీసులు చేపడుతున్న కార్యాచరణ ప్రణాళిక, సన్నాహాలు, వ్యూహాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆన్‌లైన్ అనుమతి ఫారాలు, విగ్రహాలకు జియోట్యాగింగ్, డ్రోన్లు, యాప్‌లు, సీసీటీవీలు, మల్టీ-ఏజెన్సీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వంటి ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగి స్తున్నామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ రామ్ నివాస్ సేపట్, అసిస్టెంట్ డైరెక్టర్ కల్మేశ్వర్ సింగన్వార్, డీసీపీ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## కవిత వ్యాఖ్యలకు హరీశ్ రావు కౌంటర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్‌లో అంతర్గత వివాదం మరింత వేడెక్కుతోంది. ఇటీవల లండన్ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి చేరుకున్న బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పరోక్షంగా టార్గెట్ చేసిన కవిత%ా% హరీశ్ రావు, జోగినపల్లి సంతోష్‌రావు కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కుమ్మక్కై కేసీఆర్‌ను ఇరికించారని సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై స్పందించిన హరీశ్‌రావు "నా 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం, తెలంగాణ ప్రజల ముందు ఓ తెరచిన పుస్తకం. మా పార్టీపై, నాపై రాజకీయ పార్టీలు చేసిన ఆరోపణలే ఇప్పుడు వారు (కవిత) కూడా చేశారు. ఆ వ్యాఖ్యలు ఎందుకు చేశారో వారి విజ్ఞతకే వదిలేస్తున్నా" అని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో గత రెండు దశాబ్దాలుగా రాష్ట్ర సాధన, అభివృద్ధిలో తన పాత్ర అందరికీ తెలిసిందేనని గుర్తుచేశారు. "మేమంతా కలిసి కేసీఆర్ నేతృత్వంలోనే బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తేవడమే లక్ష్యం" అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.



### కేసీఆర్‌తో హరీశ్‌రావు సమావేశం

భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌తో మాజీ మంత్రి హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇప్పటికే కేటీఆర్ సహా పలువురు పార్టీ ప్రముఖులు అక్కడ ఉన్నారు. ఇటీవల అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలు, కాళేశ్వరంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించడం, ఎమ్మెల్సీ పదవికి, భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కవిత రాజీనామా చేయడం తదితర అంశాలపై వీరు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.





## మీరట్‌లో 'న్యూడ్ గ్యాంగ్' హడల్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లా మహిళలు 'న్యూడ్ గ్యాంగ్' భయాందోళనలో ఉన్నారు. దుస్తులు లేకుండా తిరుగుతున్న వ్యక్తులు మహిళలను భయపెడుతూ, నిర్జన ప్రాంతాలకు ఈడ్చుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు నలుగురు మహిళలు ఇలాంటి వేధింపులకు గురైనట్లు స్థానికులు ఆరోపించారు. తాజాగా భారాలా గ్రామానికి చెందిన మహిళా ఉద్యోగి ఒంటరిగా డ్యూటీకి వెళ్తుండగా, నగ్నంగా ఉన్న ఇద్దరు వ్యక్తులు ఆమెను అడ్డుకున్నారు. నిర్జన ప్రదేశానికి లాక్కెళ్లేందుకు ప్రయత్నించగా, ఆమె తప్పించుకుని పారిపోయింది. కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేసిన ఆమె, భయంతో ఉద్యోగం మార్చుకున్నట్లు సమాచారం.

స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి మిగితా 2వ పేజీలో

### సీఎంను

## మర్యాదపూర్వకంగా కలిసిన కమాండింగ్ ఇన్ చీఫ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పూణే సదరన్ కమాండ్‌కు చెందిన కమాండింగ్-ఇన్-చీఫ్, జనరల్ ఆఫీసర్ లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేఠ్‌తో బందం శుక్రవారం హైదరాబాద్ కలిసింది. సీఎంను కలిసినవారిలో దక్షిణ భారత్ ఏరియా జీఓసీ మేజర్ జనరల్ ఆర్ఎన్ శ్రీనివాస్, జీఓసీ టీజీ,ఏపీ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా తదితరులు ఉన్నారు.



## ఏకలవ్య పాఠశాలలకు ప్రత్యేకంగా నిధులు

**మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటాం..**

**-ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలి..**

**- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

వివరాలు 3వ పేజీలో

# పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- గద్వాలలో డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు
- వనపర్తి జిల్లా మంగంపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో పేద ప్రజల అభ్యున్నతి కొరకు ప్రభుత్వం కృషి చేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచారం పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం గద్వాల పట్టణ సమీపంలోని దర్పల్లి దగ్గర నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు, వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం కార్యక్రమాల్లో పొంగులేటితోపాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి, కలెక్టర్లు బిఎం.సంతోష్, ఆదర్శ్ సురభి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా ముందుకు నడిపిస్తున్నామని తెలిపారు. గత పదేండ్ల కాలంలో పేదలకు ఇల్లు కట్టించి ఇవ్వాలన్న ఆలోచన ఆ ప్రభుత్వానికి రాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికీ 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని తెలిపారు. ప్రతి రెవెన్యూ గ్రామానికీ ఒక జీపీఓ కేటాయించామని, మండలానికి 20 మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించామని తెలిపారు. రాష్ట్రంపై ఇన్ని అప్పులు ఉన్నా ప్రతి నెలా వడ్డీ చెల్లిస్తూనే అభివృద్ధి, సంక్షేమాన్ని ఎక్కడా ఆపకుండా పనిచేస్తున్నామని చెప్పారు.

# తెగిన కార్గో రోప్ వే.. ఆరుగురు మృతి

**బలగం టీవీ, అహ్మదాబాద్**



కొండపై ఉన్న ఆలయం వద్ద కార్గో రోప్ వే తెగి ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ ఘటనలో ఆరుగురు సిబ్బంది మరణించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, అధికారులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గుజరాత్‌లోని పంచమహల్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు శక్తిపీఠమైన పావగఢ్ కొండ ఆలయం వద్ద గూడ్స్ రోప్‌వే వైర్ తెగిపోయింది. కొండపైకి నిర్మాణ సామాగ్రిని తీసుకెళ్లడానికి ఉపయోగించే కార్గో ట్రాలీ కేబుల్స్ తెగిపోయాయి. దీంతో నాలుగో టవర్ నుంచి ట్రాలీ కిందపడింది.కాగా, ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, అధికారులు అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మరణించినట్టు పంచమహల్ కలెక్టర్ ధృవీకరించారు. మృతుల్లో ఇద్దరు లిఫ్ట్‌మెన్లు, ఇద్దరు కార్మికులు, మరో ఇద్దరు ఉన్నట్లు తెలిపారు. సాంకేతిక బృందంతో ఈ ప్రమాదంపై దర్యాప్తు జరుపుతామని అన్నారు.మరోవైపు పావగఢ్ ఆలయం సుమారు 800 మీటర్ల ఎత్తులో ఉన్నది. 2,000 మెట్లు ఎక్కడం లేదా కేబుల్ కార్ల ద్వారా భక్తులు, యాత్రికులు శిఖరానికి చేరుకుంటారు. అయితే శనివారం ప్రతికూల వాతావరణం కారణంగా ప్రజలు ఉపయోగించే రోప్‌వేను మూసివేసినట్టు అధికారులు వెల్లడించారు.

## దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్'...

### ఈ నెల 10న రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులతో కీలక సమావేశం

### ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాల క్షుణ్ణమైన పరిశీలన

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) భారీ కసరత్తుకు శ్రీకారం చుట్టింది. బీహార్‌లో చేపట్టిన తరహాలోనే 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని దేశమంతటా అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఈ కీలక కార్యక్రమం అమలు, విధివిధానాలపై చర్చించేందుకు ఈ నెల 10న అన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులతో (సీఈఓలు) ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసింది.ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత సీఈఓలతో నిర్వహిస్తున్న మూడో కీలక సమావేశం ఇది. ముఖ్యంగా 2026లో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితాను 100 శాతం కచ్చితత్వంతో, పారదర్శకంగా తీర్చిదిద్దాలని ఎన్నికల సంఘం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా ఈ సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఇటీవల బీహార్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియను మరింత పకడ్బందీగా, పక్షపాతరహితంగా నిర్వహించేందుకు ఈసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా బంగ్లాదేశ్, మయన్మార్ వంటి దేశాల నుంచి వలస వచ్చి అక్రమంగా ఓటరు జాబితాల్లో చేరిన వారిని గుర్తించి తొలగించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశాలలో ఒకటి. ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడటంతో పాటు, బోగస్ ఓట్లకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని ఈసీ భావిస్తోంది. ఈ బృహత్తర కార్యక్రమం విజయవంతం కావాలంటే రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాల పూర్తి సహకారం అత్యంత అవసరమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## గణనాథుడి శోభాయాత్రలో డ్యాన్స్ చేస్తూ వ్యక్తి మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

గణనాథుడి శోభాయాత్రలో అపశృతి చోటు చేసుకుంది. ఓ వ్యక్తి డ్యాన్స్ చేస్తూ కుప్పకులిపోయాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా కేంద్రంలో శనివారం మధ్యాహ్నం వెలుగు చూసింది. నారాయణపేట జిల్లా కేంద్రంలో నిమజ్జనం సందర్భంగా గణనాథుడి శోభాయాత్ర నిర్వహించారు. ఈ నేపథ్యంలో యువత, పెద్దలు కలిసి డీజే పాటలకు స్టెప్పులేశారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి డ్యాన్స్ చేస్తూ అక్కడే కుప్పకూలి పోయాడు. అక్కడే విధుల్లో ఉన్న ఎస్ఐ వెంకటేశ్వర్లు అప్రమత్తమై.. ఆ వ్యక్తికి సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడిని శేఖర్(45)గా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## అక్టోబర్ 5 వరకు.. ముంబయి వీధుల్లో డ్రోన్లపై నిషేధం

**బలగం టీవీ, హైదరాబాద్**

వినాయక నిమజ్జనాలు కొనసాగుతున్న వేళ ముంబయి పోలీసులు కీలక ఆదేశాలు జారీ చేశారు. భద్రతాపరమైన ఆందోళనల కారణంగా ముంబయి వీధుల్లో డ్రోన్లు పారాగ్లైడర్లు, రిమోట్ కంట్రోల్‌తో నడిచే మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, హాట్ ఎయిర్‌బెలూన్లు ఎగురవేయడంపై నిషేధం విధించారు. సెప్టెంబర్ 6 నుంచి అక్టోబర్ 5 వరకు మొత్తం 30 రోజులు ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయని అధికారులు వెల్లడించారు. వినాయక నిమజ్జనాలు కొనసాగుతుండటం, త్వరలో దసరా నవరాత్రులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.సెప్టెంబర్ 6న గణనాథుడి నిమజ్జనం సందర్భంగా నగరంలో భారీ జనసమూహం ఉంటుందని అంచనా వేశారు. దీంతో నగరంలో శాంతి భద్రతలను రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పలు ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేసినట్టు తెలిపారు. డ్రోన్లు, పారాగ్లైడర్లు వంటి ఎగిరే వస్తువుల ద్వారా ఎలాంటి విధ్వంసం జరగకుండా ఈ ఆంక్షలు విధించామని.. వాటిని ఉల్లంఘించినవారు శిక్షార్హులన్నారు.

## దక్షిణాదికి గేమ్ చేంజర్‌గా

# ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి

(మొదటి పేజీ తరువాయి)

త్వరగా పూర్తిచేయాలని అన్నారు. రైల్వే, కెనాల్, మున్నేరుపై రహదారి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నుంచి సత్తుపల్లి వరకు జాతీయ రహదారికి సర్వీస్ రోడ్లు వేస్తే రైతులకు ఉపయోగ పడుతుందని, దీనికి కావలసిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా వ్యవసాయ ప్రాంతం అధికంగా ఉందని, నాగార్జున్ సాగర్ కాల్వ క్రింద ఆయకట్టు ఉన్నందున 365 రోజుల పాటు హార్వెస్టర్ రాకపోకలు ఉంటాయని, రహదారి వాహనాలకు ఆటంకం కలగకుండా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వర్షాలు తగ్గిన నేపథ్యంలో మున్నేరు బ్రిడ్జితో పాటు ధంసలాపురం ఎగ్జిట్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి చిన్న, చిన్న సమస్యలు ఉంటే కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, నేషనల్ హైవే పిడి దివ్య, ఆర్‌అండ్‌బి ఎస్ఇ యాకోబ్, ఖమ్మం ఆర్‌డిఒ నర్సింహారావు, కార్పొరేటర్లు కమర్తపు మురళి, రావూరికరుణ సైదుబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు సాదు రమేశ్ రెడ్డి,వ డ్డెబోయిన నర్సింహారావు, బ్రహ్మారెడ్డి, ఏడుకొండలు, అంజిరెడ్డి, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సైదులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మీరట్‌లో 'న్యూడ్ గ్యాంగ్' హడల్

(మొదటి పేజీ తరువాయి)

దిగారు. సంఘటనలపై దర్యాప్తు ప్రారంభించి, డ్రోన్లతో పర్యవేక్షణ చేస్తున్నారు. మహిళల భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు మహిళా పోలీసులను ఆ ప్రాంతంలో మోహరించారు. ఈ ఘటనల వెనుక ఆకతాయిల పనేనని కొందరు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## రేపు సీపీగెట్ ఫలితాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో 2025-26 విద్యాసంవత్సరంలో వివిధ విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ (సీపీగెట్) ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. ఈ మేరకు సీపీగెట్ కన్వీనర్ పాండురంగారెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో విడుదలవుతాయని వివరించారు. ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ ఎం కుమార్, ఇతర వీసీలు, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఓయూ రిజిస్ట్రార్ జి నరేశ్‌రెడ్డి విడుదల చేస్తారని తెలిపారు. గతనెల ఆరు నుంచి 11 వరకు ఆన్‌లైన్‌లో సీపీగెట్ రాతపరీక్షలను నిర్వహించామని పేర్కొన్నారు. 62,806 మంది దరఖాస్తు చేశారనీ, వారిలో 54,695 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని వివరించారు.

## 17న కంటోన్మెంట్ పార్కులో వాజ్‌పేయ్ విగ్రహావిష్కరణ


**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని (17న) రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బిజెపి రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన శనివారం బర్కత్‌పురాలోని పార్టీ నగర శాఖ కార్యాలయంలో ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కూడా పాల్గొన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ పార్కులో దివంగత మాజీ ప్రధాని ఎబి వాజ్‌పేయ్ విగ్రహాన్ని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆవిష్కరించనున్నందున ఏర్పాట్లపై వారు చర్చించారు.

అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 2022 సంవత్సరం నుంచి కేంద్ర పర్యాటక శాఖ అధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నది. 2022, 2023 సంవత్సరాల్లో కేంద్ర హెూం మంత్రి అమీత్ షా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత ఏడాది కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ఏడాది కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరుకానున్నారు.

# ఎర్రకోటలో భారీ దొంగతనం

**బలగం టీవీ, హైదరాబాద్**



దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఎర్రకోటలో భారీ దొంగతనం జరిగింది. ఇటీవల అక్కడ జరిగిన ఓ మతపరమైన కార్యక్రమంలో రూ.కోటి విలువైన రెండు బంగారు కలశాలు చోరీకి గురయ్యాయి. అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. సెప్టెంబర్ 3న ఉదయం ఎర్రకోటలో ఓ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం కోసం వ్యాపారవేత్త సుధీర్ కుమార్ జైన్ తీసుకొచ్చిన బంగారు కలశాలు కనిపించకుండా పోయాయి.పూజ కోసం తాను తీసుకువచ్చిన 760 గ్రాములు బంగారు కలశం, వజ్రాలు, మాణిక్యాలు, పచ్చలతో పొదిగిన 115 గ్రాముల మరో చిన్న బంగారు కలశం పూజ అనంతరం కనిపించలేదని సుధీర్ జైన్ ఎర్రకోట నిర్వాహకులకు ఫిర్యాదుచేశారు. పూజా కార్యక్రమానికి ప్రముఖులు హాజరవ్వడంతో తాము పక్కకు వెళ్లామని, అంతలోనే ఈ దొంగతనం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఎర్రకోట నిర్వాహకులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఎవరూ లేని సమయంలో ఓ వ్యక్తి పూజ సామగ్రి ఉన్న గదిలోకి వెళ్లి, రెండు కలశాలను సంచిలో వేసుకుంటున్న దృశ్యాలు కనిపించాయి. చోరీ అనంతరం అతడు అక్కడి నుంచి బయటకు వెళ్లిన దృశ్యాలు రికార్డయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# ఏకలవ్య పాఠశాలలకు ప్రత్యేకంగా నిధులు

## మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటాం..

**-ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలి..**

**- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**బలగం టివి, రాజన్న సిరిసిల్ల**

ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీలను పకడ్బం దీగా నిర్వహించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం కొనరావుపేట మండలం మర్రిమడ్ల నందు గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లో 5వ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెలక్షన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలోరాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లతో కలిసి పాల్గొన్నారు

ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మంత్రి స్థాయిలో నేడు కొనరావు పేట మండలంలో జరుగుతున్న ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీలకు రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. తక్కువ సమయంలో క్రీడ పోటీల నిర్వహణకు మంచి ఏర్పాటు చేసిన అధికారులను సిబ్బందిని అభినందించారు.

రాష్ట్ర నలుమూలల నుంచి నేడు 1200 మంది పైగా విద్యార్థులకు క్రీడా పోటీలు జరుగుతున్నాయని అన్నారు . ఇండోర్ అండ్ ఔట్ డోర్ క్రీడా పోటీలను ప్రణాళిక ప్రకారం పక్కగా నిర్వహించాలని అన్నారు. పిల్లలకు ఎక్కడ ఇబ్బంది కలగకుండా క్రీడా పోటీలు నిర్వహించాలని,నిబంధనలు ప్రకారం పోటీలు నిర్వహించాలని అన్నారు. ఏకలవ్య పాఠశాల లకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని , తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత 740 కోట్ల రూపాయలు గిరిజన గ్రామ పంచాయతీలకు విడుదల చేశామని అన్నారు.

ప్రభుత్వ విప్ కోరిక మేరకు గిరిజన ప్రాంతాలకు రోడ్ల నిర్మాణానికి అదనంగా 10 కోట్లు రూపాయలు తప్పనిసరిగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలకు మంచి విద్యార్థి అందించాలని లక్ష్యంతో గురుకులాలను ప్రభుత్వం నిర్వహిస్తుం దని అన్నారు. గురుకుల లో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని, అనేకమంది కలెక్టర్, ఎస్పీ లాయర్లు డాక్టర్లు ఇంజనీర్లు వంటి గొప్ప స్థానాలకు ఎదిగారని అన్నారు.

దేశం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సూచన ప్రకారం



పిల్లలంతా కళలు కన్ని వాటిని సాకారం చేసుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవా లని, గురుకులాలో ఉపాధ్యాయులు చెప్పే మాటలు పాటించాలని అన్నారు. చిన్నారులలో ఉన్న సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహిం చాలని సూచించారు. ఉపాధ్యాయుల అంతర్గత బదిలీలు, పదోన్నతుల కల్పన, గురుకులాల్లో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీల, ప్రతి నియోజకవర్గ పరిధిలో 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం, అడ్వాన్స్ ట్రేడ్ సెంటర్ ల ద్వారా ప్రత్యేక నైపుణ్యా శిక్షణ అందించడం నువ్వంటే అనేక కార్యక్రమాలను విద్యాశాఖలు ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు.

పేదలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీలలో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి ముందుకు పోవాలని అన్నారు. క్రీడలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుందని అన్నారు. క్రీడాకారులకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత అందిస్తుందని అన్నారు. వేములవాడ నియోజకవర్గం లోని గిరిజన ప్రాంతాలకు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, మనకు 9 కోట్లు నిధులు మంజూరు చేసినందుకు మంత్రి వర్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వేములవాడకు మరో 10 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీలలో విద్యార్థులంతా ఉత్సాహంతో పాల్గొనాలని, మన రాష్ట్రం నుంచి అధికంగా క్రీడాకారులు ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనాలని ఆకాంక్షించారు. క్రీడలు ఆడే సమయంలో గెలవడం పోవడం ముఖ్యం కాదని పాల్గొనడం చాలా కీలకమని, క్రీడల వల్ల విద్యార్థులకు మంచి క్రీడా స్ఫూర్తి లభిస్తుందని అన్నారు. రాబోయే మూడు రోజుల పాటు ఈఎంఆర్ఎస్ క్రీడ పోటీల సంద ర్భంగా విద్యార్థులందరికీ మంచి ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని,క్రీడ పోటీల నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

ఈఎంఆర్ఎస్ సెక్రటరీ సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ 5వ జాతీయ ఈఎంఆర్ఎస్ స్పోర్ట్స్ సెలక్షన్ మీట్ నేడు జరుగుతుందని, ఇందులో 300 మంది క్రీడాకారులు తెలంగాణ రాష్ట్రాన్ని జాతీయ ఈఎంఆర్ఎస్ క్రీడ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. గత సంవత్సరం తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపిక చేసిన క్రీడాకారులు అనేక పతకాలు సాధించడం జరిగిందని అన్నారు. నేడు రాష్ట్రం లోని 23 ఈఎంఆర్ఎస్ పాఠశాలల నుంచి 1200 అమ్మది బాలికలు వచ్చారని, 16 రకాల క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలని, గెలవడం ఓడటం సహజమని, క్రీడలలో పాల్గొనడం చాలా ముఖ్యమని అన్నారు. ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన మాలావత్ పూర్ణ మాట్లాడుతూ గురువుల పాఠశాలలో చదువుకున్న తాను ఎవరెస్ట్ శిఖరం అధిరోహించడం జరిగిందని అన్నారు. మనం ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నా మనం నిర్దేశించుకున్న మంచి లక్ష్యం సాధన కోసం కృషి చేస్తే సమాజం మొత్తం మనకు సహకారం అందిస్తుందని అన్నారు. లక్ష్యం దిశగా మొదటి అడుగు వేయడం చాలా కీలకమని అన్నారు. మనం ఏదైనా సాధించాలి అనుకుంటే కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావాలని అన్నారు. అనంతరం మంత్రి , విప్, జిల్లా కలెక్టర్ లను స్కూల్ యాజమాన్యం సన్మానం చేశారు. కబడ్డీ క్రీడ పోటీలను మంత్రి ప్రారంభించారుఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాజు వేములవాడ ఏఎస్పి శేషాద్రిని రెడ్డి, ఆర్డిఓ రాధా బాయి , విద్యార్థిని విద్యార్థులు ప్రిన్సిపాల్ లు, పి ఈ టి లు, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలోని జేఎన్‌టీయూ విద్యార్థుల సమస్యలపై చర్యలు తీసుకోవాలి

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టివి, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్లలోని జేఎన్‌టీయూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన జేఎన్‌టీయూ సిరిసిల్ల ఇంజినీరింగ్ కాలేజీకి అవసరమైన శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వేములవాడలోని డిగ్రీ కాలేజీలో కొనసాగుతున్న ప్రస్తుత తాత్కాలిక తరగతి గదులకు తాళం వేయడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై పత్రికల్లో వచ్చిన వార్తను కేటీఆర్ సీరియస్‌గా తీసుకున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేటీఆర్ వెంటనే రంగంలోకి దిగారు. జేఎన్టీయూ వైస్ చాన్సలర్ కిషన్ కుమార్ రెడ్డితో పాటు, సాంకేతిక విద్యా కమిషనర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని, త్వరగా శాశ్వత భవనాలకు అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభించాలని సూచించారు. అంతవరకు ప్రస్తుతం నడుస్తున్న తీరుగానే స్థానిక అగ్రహారంలోని డిగ్రీ కాలేజీ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీ కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే కాలేజీతో అవసరమైన ఒప్పందం చేసుకొని పెండింగ్‌లో ఉన్న అద్దె బకాయిలను చెల్లించేలా చూడాలని కోరారు. ఈ అంశంలో సానుకూలంగా స్పందించిన టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ వెంటనే పెండింగ్ బకాయిలను చెల్లించడంతోపాటు తరగతులకు ఎలాంటి అంతరాయం లేకుంటే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.



బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో సిరిసిల్లలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీని మంజూరు చేసింది. దీని కోసం రూ.402 కోట్లు కేటాయించారు. మొదటి విద్యా సంవత్సరంలో 360 మంది విద్యార్థులతో తరగతులు ప్రారంభించారు. ప్రస్తుతం సుమారు 1032 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 700 మందికి హాస్టల్ వసతి కూడా కల్పించారు. కొత్త భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు డిగ్రీ కాలేజీలో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే, కాలేజీ కమిషనర్ నుంచి తాత్కాలిక వసతి పొడిగింపు ఉత్తర్వులు రానందున, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ తరగతి గదులకు తాళం వేశారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న అంశాన్ని తెలుసుకున్న కేటీఆర్, సంబంధిత అధికారులతో మాట్లాడారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీల, టీచింగ్, వసతికి సంబంధించిన ఈ సమస్యను పరిష్కరించడానికి జేఎన్‌టీయూ అధికారులు జూలైలోనే కాలేజీ కమీషనర్‌కు ప్రతిపాదనలు పంపినప్పటికీ, ఇంతవరకు ఎటువంటి స్పందన రాలేదు. వెంటనే ఈ అంశంలో తగిన అనుమతులు ఆదేశాలు స్థానిక డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఇవ్వాలని కేటీఆర్ సూచించారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వ అధికారులు ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 2023లోనే మండెపల్లి గ్రామంలో 20 ఎకరాల స్థలం కేటాయించినందున, అక్కడ త్వరగా శాశ్వత భవనాల నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆయన కోరారు. ఈ సమస్యపై ప్రభుత్వ అధికారులు తక్షణమే దృష్టి సారించి విద్యార్థులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ అంశంలో వందలాది విద్యార్థుల సమస్యలపై వేగంగా స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడిన కేటీఆర్‌కు విద్యార్థులు తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

## సీఎంపై వ్యక్తిగత దూషణలకు పాల్పడిన బీఆర్ఎస్ కార్యకర్తపై పోలీసులకు ఫిర్యాదు

- **ఇప్పటికే మూడు సార్లు యూరియా తీసుకెళ్లి ఇష్టారీతిన ఆరోపణలు**
- **జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన యూరియా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మానుక లక్ష్మణ్ యాదవ్ మూడు సార్లు తీసుకెళ్లి ఇష్టారీతిన ఆరోపణలు చేయడం సరికాదని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మానుక లక్ష్మణ్ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచిత వాఖ్యలు, వ్యక్తిగత దూషణలు చేశారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు గురువారం ఎస్సై రాహుల్ రెడ్డికి ఫిర్యాదు చేశారని అన్నారు.

ఎల్లారెడ్డిపేట సింగిల్ విండో గోదాం వద్ద యూరియా కోసం వచ్చిన రైతుల సమక్షంలోనే అందరూ చూస్తుండగానే ఎల్లారెడ్డిపేట బీ ఆర్ఎస్ పార్టీ కార్యకర్త మానుక లక్ష్మణ్ యాదవ్ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తన కాలికి తొడిగిన చెప్పును ఎత్తి చూపుతూ వ్యక్తి గత దూషణలకు దిగాడని, అతడిపై విచారణ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారని అన్నారు.సీఎంను దూషించిన ఆడియో వీడియో రికార్డులను ఫోటోలను పోలీసులకు అందజేశారని, ఎల్లారెడ్డిపేట పోలీసులు లక్ష్మణ్ యాదవ్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.. మానుక లక్ష్మణ్ యాదవ్ ఇప్పటికే మూడు సార్లు యూరియా తీసుకెళ్లారని,యూరియా తీసుకెళ్తూ ఇలా ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేయడం సరికాదని పేర్కొన్నారు.




## వృద్ధ మహిళలే టార్గెట్

**- చైన్ స్నాచర్ అరెస్ట్**

**బలగం టివి, వీణవంక**

కుటుంబాన్ని పోషించే స్తోమత లేకపోవడంతో పాటు పేకాట, జల్సాలకు బానిసైన ఓ వ్యక్తి వృద్ధ మహిళలనే టార్గెట్ చేస్తూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. ఆరు నెలల వ్యవధిలో ఐదు చోట్ల దొంగతనాలకు పాల్పడి మొత్తం 14 తులాల బంగారం ఎత్తుకెళ్లాడు. చివరికి 48 గంటల పాటు పోలీసులు చేసిన కృషితో నిందితుడు పట్టుబడి 11 తులాల బంగారం రికవరీ అయ్యింది. హుజూరాబాద్ ఏసీపీ మాధవి వివరాల ప్రకారం మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన కొలిపాక రవి (38) పేకాట, జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. 60 ఏళ్లు దాటిన వృద్ధ మహిళల మెడలోని బంగారు తాడ్లను లక్ష్యంగా చేసుకుని చల్లూరు, మామిడాలపల్లి, దేశాయిపల్లి, మానకొండూరు మండలం అన్నారం, జమ్మికుంట మండలం కొత్తపల్లిలో దొంగతనాలు జరిపాడు. దొంగిలించిన బంగారాన్ని కొంత సుల్తానాబాద్‌లోని ముత్తూట్ ఫైనాన్స్, ఫిన్కార్స్ వద్ద తాకట్టు పెట్టగా, కొంతను మహారాష్ట్రకు తీసుకెళ్లి కరిగించి డబ్బులు తెచ్చుకున్నాడు. పోలీసులకు అందిన సమాచారం ఆధారంగా జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఆవుల తిరుపతి బృందం 48 గంటల పాటు సెల్‌ఫోన్ సిగ్నల్స్‌ను అనుసరించి నిందితున్ని శనివారం చల్లూరు శివారులో పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 11 తులాల బంగారం రికవరీ చేసినట్లు ఏసీపీ తెలిపారు. మరో చైన్ సుల్తానాబాద్‌లోని ముత్తూట్ ఫిన్కార్స్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసు చేధనలో కృషి చేసిన సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఆవుల తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ మోహన్, కానిస్టేబుళ్లు కోమల్, ప్రశాంత్, రమేష్, మహేశ్‌లను ఏసీపీ మాధవి అభినందించి రివార్డులు అందజేశారు.



## ఆసియా కప్ ముందు శ్రీలంకకు షాక్

- **జింబాబ్వే చేతిలో చిత్తు**

**బలగం టీవీ, హరారే**

ఆసియా కప్ ముంగిట శ్రీలంక జట్టుకు భారీ షాక్ తగిలింది. హరారే వేదికగా జరిగిన రెండో టీ20లో జింబాబ్వే చేతిలో లంక 5 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. 80 పరుగులకే ఆలౌటైన లంక, స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది. చేదనలో జింబాబ్వే ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్ (19), తడివనషె మరుమణి (17) శుభారంభం ఇచ్చారు. చివర్లో తషింగ ముసెక్వివా (21 నాటౌట్), రియాన్ బురి (20 నాటౌట్) జట్టును విజయతీరాలకు చేర్చారు. విజయానికి ఐదు పరుగులు అవసరమైన వేళ ముసెక్వివా వరుసగా రెండు బౌండరీలు బాదడంతో జింబాబ్వే గెలిచి సిరీస్‌ను 1–1తో సమం చేసింది.

మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంకను జింబాబ్వే బౌలర్లు దెబ్బతీశారు. కెప్టెన్ సికిందర్ రజా (3/11), బ్రాడ్ ఎవాన్స్ (3/15) తలా మూడేసి వికెట్లు పడగొట్టారు. కమిల్ మిషర (20), చరిత అసలంక (18), దసున్ షనక (15) మినహా ఎవరూ రాణించలేకపోయారు. 17.4 ఓవర్లలో 80 పరుగులకే లంక ఆలౌటైంది. అనంతరం ఛేదనలో ఓపెనర్లు లంక పేసర్లను కాచుకొని శు భారంభం ఇచ్చారు. అయితే దుష్మంత చమీర (3/19) అద్భుత బౌలింగ్‌తో సీన్ విలియమ్స్ (0), సికిందర్ రజా (2) వంటి కీలక వికెట్లు పడగొట్టాడు. జట్టు స్కోరు 50 దాటిన దశలో బెన్నెట్ (19)ను ఫెర్నాండో ఔట్ చేసి లంక ఆశలు పెంచాడు. కానీ%ా% రియాన్ బురి (20 నాటౌట్), తషింగ ముసెక్వివా (21 నాటౌట్)లు ఒత్తిడికి లొంగకుండా బ్యాటింగ్ చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. హేమంత వేసిన 15వ ఓవర్లో ముసెక్వివా తొలి రెండు బంతులను ఫోర్లుగా మలిచడంతో జింబాబ్వే విజయం ఖరారైంది. కీలక సందర్భంలో అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన రజా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. ఇరుజట్ల మధ్య నిర్ణయాత్మక మూడో మ్యాచ్ సెప్టెంబర్ 7న జరగనుంది.




## ఉమేష్ శుక్లా నుంచి కొత్త లవ్ స్టోరీ

**బలగం టీవీ, హైదరాబాద్**

'ఓ మై గాడ్', '102 నాట్ అవుట్' వంటి హిట్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు ఉమేష్ శుక్లా తాజా చిత్రం హీర్ ఎక్స్‌ప్రెస్తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. సెప్టెంబర్ 12న విడుదల కానున్న ఈ సినిమాలో దివిత జునేజా, ప్రిత్ కమాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో అశుతోష్ రానా, గుల్షన్ గ్రోవర్, సంజయ్ మిశ్రా, మేఘనా మాలిక్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇండియా, లండన్ లో చిత్రీకరించిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్న నమ్మకాన్ని చిత్ర యూనిట్ వ్యక్తం చేసింది. సైయారా వంటి బ్లాక్‌బస్టర్ విజయాల తర్వాత బాలీవుడ్‌లో లవ్ స్టోరీ చిత్రాలకు డిమాండ్ పెరుగుతుండగా, అదే తరహాలో హీర్ ఎక్స్‌ప్రెస్ను తెరకెక్కించారు. తాజాగా విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తోంది. ఈ చిత్రాన్ని ఉమేష్ శుక్లా, ఆశిష్ వాఘ్, మోహిత్ ఛబ్రా, సంజయ్ గ్రోవర్ సంయుక్తంగా నిర్మించగా, సంపదా వాఘ్ సహ నిర్మాతగా వ్యవహరించారు.

# ఆసియా కప్ ఫైనల్లో భారత జట్టు

- **చైనాపై 7-0తో ఏకపక్ష విజయం**

**బలగం టీవీ, హైదరాబాద్**

స్వదేశంలో జరుగుతున్న హాకీ ఆసియా కప్‌లో భారత జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. సూపర్ 4 మ్యాచ్‌లో చైనాపై 7–0 తేడాతో ఘన విజయం సాధించింది. ఏకపక్ష పోరులో ప్రత్యర్థిని మట్టికరిపించిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన, ఫైనల్‌కి అర్హత సాధించింది.

నాలుగో ఆసియా కప్ టైటిల్ కోసం భారత జట్టు దక్షిణ కొరియాతో తలపడనుంది. బిహార్‌లోని రాజ్‌గిర్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో టీమిండియా జైత్రయాత్ర కొనసాగుతోంది. తొలి రెండు మ్యాచుల్లో స్వల్ప తేడాతో విజయం సాధించిన భారత్, సూపర్ 4లో మాత్రం రాణిస్తోంది. మలేషియాపై 17–0 భారీ విజయంతో దూసుకెళ్లిన హర్మన్‌ప్రీత్ సేన, చైనాను కూడా చిత్తు చేసింది.



ప్రతిభావంతమైన అటాకింగ్, దృఢమైన డిఫెన్స్‌తో అన్ని విభాగాల్లోనూ సమిష్టి ఆటతీరును ప్రదర్శించిన భారత జట్టు ప్రత్యర్థిని నిలువరించలేనంతగా రాణించింది.

## 65వ సినిమా ప్రారంభించిన అల్లరి నరేష్



**బలగం టీవీ, హైదరాబాద్**

ఒకవైపు ఆల్కాహాల్ సినిమాను విడుదలకు సిద్ధం చేస్తూనే, మరో కొత్త ప్రాజెక్ట్‌ను అల్లరి నరేష్ ప్రారంభించారు. తన కెరీర్‌లో 65వ సినిమాగా రాబోతున్న ఈ చిత్రం శనివారం పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. పౌరాణిక హాస్యభరిత కథాంశంతో తెరకెక్కనున్న ఈ చిత్ర ప్రారంభోత్సవానికి పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. అక్కినేని నాగచైతన్య క్లాప్ కొట్టగా, దర్శకుడు బాబీ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తొలి షాట్‌కి దర్శకుడు వి.ఐ. ఆనంద్ దర్శకత్వం వహించారు. దర్శకులు వశిష్ట, విజయ్‌కుమార్, రామ్ అబ్బరాజు స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందజేశారు. ఈ చిత్రానికి చంద్రమోహన్ సి దర్శకత్వం వహించనున్నారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండ, అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై లెమన్ ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంగీతం చైతన్ భరద్వాజ్ అందించగా, ఎడిటింగ్ ఛోటా కె. ప్రసాద్ చేస్తున్నారు. త్వరలోనే షూటింగ్ మొదలుకానున్న ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరికొత్త పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.

## సైమా వేదికపై మెరిసిన 'కమిటీ కుర్రోళ్లు'

**బలగం టీవీ, హైదరాబాద్**

చిన్న సినిమాగా విడుదలై భారీ విజయాన్ని సాధించిన కమిటీ కుర్రోళ్లు చిత్రం ఇప్పుడు అవార్డుల వేదికలపై దుమ్మురేపుతోంది. దుబాయ్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక సైమా–2025 (సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) వేడుకలో ఈ చిత్రం రెండు కీలక పురస్కారాలను కైవసం చేసుకుంది. ఈ సినిమాతో నిర్మాతగా మారిన నిహారిక కొణిదెల 'ఉత్తమ నూతన నిర్మాత' అవార్డు అందుకోగా, హీరోగా నటించిన సందీప్ సరోజ్ 'ఉత్తమ నూతన నటుడు'గా ఎంపికయ్యాడు.

గత ఏడాది ఆగస్టు 9న విడుదలైన ఈ చిత్రం కమర్షియల్‌గా ఘన విజయాన్ని సాధించడమే కాకుండా విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై గౌరవాలు అందుకున్న ఈ సినిమా ఇప్పుడు సైమా పురస్కారాలతో మరోసారి వార్తల్లో నిలిచింది. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డ్లో జాతీయ సమైక్యతపై ఉత్తమ చిత్రంగా నిలిచిన ఈ సినిమా, దర్శకుడు యదు వంశీకి 'ఉత్తమ తొలి దర్శకుడు' అవార్డును అందించింది. అలాగే గామా అవార్డ్స్‌నూ నిహారిక (ఉత్తమ నూతన నిర్మాత), యదు వంశీ (ఉత్తమ నూతన దర్శకుడు) పురస్కారాలు గెలుచుకోవడం విశేషం. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్లపై నిర్మితమైన ఈ చిత్రం కేవలం రూ.9 కోట్ల



బడ్జెట్‌తో తెరకెక్కింది. థియేట్రికల్, నాన్–థియేట్రికల్ హక్కుల ద్వారా రూ.24.5 కోట్లకు పైగా వసూళ్లు సాధించి నిర్మాతలకు భారీ లాభాలను అందించింది. ఈ చిత్రానికి యదు వంశీ దర్శకత్వం వహించగా, అనుదీప్ దేవ్ సంగీతం అందించారు.

## ఘనంగా గణేష్ నిమజ్జనం





